# మతాబాల తలంబ్రాలు

లోకం పెళ్ళిచేసుకుంటోంది. ఘనంగా జరిగిపోతోంది—పెళ్ళి! ముత్యాల తలంబ్రాలు...తలంబ్రాల ముత్యాలు—వెలుగ్గా మండిపోతున్నాయి మతాబాలు...లోకం బుర్ర మీదించి జలజలా జారుతున్నాయి. గంతులువేస్తూ జారుతున్నాయి. మసక మసక చీకట్లో వెలుతురుగా జాలువారుతున్నాయి. మూలుగుతున్న భూమిమీద నడయాడుతున్నాయి. జూలుదులిపి గంతులువేస్తున్నాయి—ముచ్చటపడుతున్నాయి.

చీదరగా ఈదరగాలి...ఈదరలోని పేదవాళ్ళ పేలికజుత్తులా చీదరగాలి. పేదవాళ్ళలా తన బతుకుచూసి తనే ఛీత్కరించుకుంటుంది.

లోకం పెళ్ళికి కారణాలు మతాబాలు ... మతాబాల ముత్యాలు తలంబ్రాలు:—లోకం దేవుడులాంటిది—లోకం పెళ్ళికి అంతా పెద్దలే — పేదవాళ్ళుతప్ప.

మారుమూల మలినంలో మాలపల్లి...నిద్రలేని భోగం, చాన కంట్లోపుసిలా—పెళ్ళిచేసుకుంటున్న లోకంలోమాలపల్లి

లోకానికీ పెళ్ళి! తమ కేపెళ్ళి అనుకుంటారు... వెర్రిగా గంతులు వేస్తారు కుర్రాళ్ళు ... సందుమలుపుల్లో తారట్లాడ తారు కుర్రాళ్ళు...తచ్చాడతారు పిచ్చాళ్ళు. ఒకళ్ళ నొకళ్ళు యీసగా గేలిచేసుకుంటారు, చింపిరిజుత్తు పోలిగాళ్ళు! తాటాకు టపాకాయలతో తంటాలు పడతారు పేదవాళ్లు.

లోకం పెళ్ళిచేసుకుంటుంది. మహావైభవంగా జరుగు తుంది పెళ్ళి. సుఖభోగుల సంతోష స్వప్నంలా లోకపు వైవా హిక స్ఫూర్తి!

"అమావాస్యనాడు పెళ్ళేమిటి?"—ప్రశ్నిస్తాడుసిద్ధాంతి.. పిలక ముడివిప్పి గాలిలో ఎగిరేస్తాడు!

"ముండామోసే పెళ్ళికి ముహూర్తాలు తిథులూ దేనికి?' తిరిగి ప్రశ్నిస్తాడు ఆధునికుడు...క్రాఫు సవరించుకొని, కాలర్ పైకెత్తి కళ్ళజోడు తుడుచుకుంటాడు, ఆధునికుడు.

వల్లకాడులా ఆకాశం. మండుతున్న శవాలు నక్షత్రాలు...కముకు కంపు పొగ, దట్టంగా వ్యాపించిన చీకటి... ఆకాశంలా ఆరనిచిచ్చు, రాకాసిక్షామం. పేదవాని ఆకలి, ఆకాశంలా ఆరనిచిచ్చు!

లోకం పెళ్ళి చిచ్చుబుడ్లు వెలిగించుకుంది. తాచు పాముల బుస :—లోకాన్ని కరవడానాగుపాము...పెంకుటెంటి లోకం మేడమీదిలోకం వెలిగించిన తాచుపాములు బుస కొడుతూ తాటాకుపాకల్ని కరుస్తాయి.

టెలిగ్రాం ఇస్తే పాముల నరసయ్య మంత్రం వేస్తాడు. టిక్కెట్టు లేదు. మంత్రం పట్టిచ్చేసరికి తాటాకిల్లు చచ్చి పోతుంది. బూడిద మిగులుతుంది. పాముల నరసయ్య మంత్రం ఫైర్ సర్వీస్ వంటిది. తాటాకుపాకల అదృష్టం ప్రభుత్వాల దయవంటిది!

"ఆయుర్దాయంలేని వెధవలు చస్తే నాకేం?"— అంటుంది...కులుకుతున్న లోకం, శోభనం చేసుకుంటుంది... కార్యం చేసుకుని, కాపరం చేసుకుంటుంది.

ఏంచేసుకున్నా లోకానికి చెల్లుతుంది. చెల్లని రూపాయిలు చెల్లేకాలం...నోట్ల ముమ్మారంలాంటికాలం...ఉబ్బసంలాంటి కాలం...డబ్బిస్తేచాలు—లంచం ఇస్తే పెర్మిటు:— "మంచికాలం...మంచికాలం..."అనుకుంటుంది లోకం.

"ఏం అఘాయిత్యం వచ్చిపడింది. పేదవాళ్ళు మలమల మాడిపోతున్నారు. ధనికులు మత్తుగా గంతులువేస్తున్నారు... లక్షాధికార్లు కోటీశ్వరులవుతున్నారు. పేదవాళ్ళు బిచ్చగాళ్ళవుతున్నారు!" అంటాడు విలోకి...ముక్కుమీద వేలేసుకుంటాడు విలోకి!

లోకం వసంతం చల్లుకుంటోంది. పానకం త్రాగుతోంది లోకం.

వెధవ వుడకలు...త్రాగుతున్న పానకానికి అడ్డుపడుతున్నాయి. వెధవ వుడకలు!

గడ్డి పరకల్లాంటి పుడకలు దుమారం లేవతీస్తాయి. తుఫానులా చెలరేగుతాయి.

ఒకవాయి మతాబాలు తింది ఇడ్డెన్‌లాంటి లోకం... రెండోవాయి కౌగిలబడుతోంది పెళ్ళిచేసుకుంటున్న లోకం. బెదిరిన పైట సర్దుకుంటూ కామాక్షిలా బిత్తరగా చూస్తుంది. ముత్యాల వెలుతురులో లోకం కళ్ళు కాలిపోతున్నాయి— మిట్ట మధ్యాహ్నం సూర్యుని వేడికి చెరువు కాలిపోతుంది.

బాణసంచా అడుక్కుంటూరు, పేదవాళ్ళు. పేలిపోయిన తాటాకు టపాకాయలవంటి మొహాలు, మతాబాలకేసి ఆశగా చూస్తాయి...ఎవరో త్రాగేసి బోర్లించిన జీవితాలు !—కాలీ మనీపర్సులు వాళ్ళ ఆశలు.

గదిమి పారేస్తుంది, పెళ్ళికూతురు—లోకం. భయపడతారు పేదవాళ్ళు. వణికి, కంపిస్తాయి గడ్డిపరకలు...గర్జించిన లోకం ఝంఝూ మారుతానికి ఎదిగి కొట్టుకుపోతాయి— వెలిగి. పేలి, ఆరిపోయిన తాటాకు టపాకాయలు.

లోకాన్ని ఆలోకించి, లోలోపల సమాలోచించుకొని, తల పంకిస్తాడు విలోకి.

ఇతనికి చానా పేర్లు, చాలా రూపాలు...గాలిలాంటివాడు ... నీరులాంటివాడు ... నిప్పులాంటివాడు ... జీవితంలాంటివాడు...పాంచభౌతికుడు...

ఓరిమి ఎవళ్ళకేనా కొంతకాలమే ఉంటుంది. దిక్కు-మాలిన పేదవాళ్ళ పిచ్చిగోలకి దరీ అంతూ లేకపోతే...ఘల్లున పెళ్ళిచేసుకుంటున్న లోకం చవటపీనుగ్గనక నాచేతులుముడుచు కూర్చోడానికి:— అర్డినెన్సులు వేస్తుంది ... లాఠీరావుగారిచే తగంభీరంగా ఉపన్యాసా లిప్పిస్తుంది...శ్రీయుత మెషిన్‌గన్ శాస్త్రిచే సామవేదం వల్లెవేయిస్తుంది...మిస్ టియర్‌గాస్‌గారి నాట్యం ఏర్పాటు చేస్తుంది.చవటపీనుగ్గనకనా చేతులుముడుచు కూర్చోడానికి!!—పెళ్ళిచేసుకుంటున్న లోకానికి మంచీ చెడ్డా తెలియదంటే ఎవరు నమ్ముతారు?

'భేష్: మంచిపని చేశావ్!' అంటారు లోకం బంధువులు

అంటారా రేడియో నడిగితే ఏమంటుందో తెలుసా?—" పేదల శత్రువుని బహిరంగంగా ద్వేషించాలి ... లోపాయి కారీగా ప్రేమించాలి...ప్రేమించి పెళ్ళిచేసుకోవాలి ... పెళ్ళి చేసుకుని రహస్యంగా మారణాయుధాలు కనాలి...కని పేద వాళ్ళ జీవితాలకి శాంతియుతంగా పంచిపెట్టాలి..."అంటారా రేడియో చెప్పేది వృథాకాదని లోకానికి తెలుసు...అందు చేతనే, పెళ్ళిచేసుకుంటున్న లోకం మందుగుండు సామగ్రి ఉపయోగిస్తోంది, నేర్పుగా!

లోకం దేవుడిలాంటిది. ప్రతీఏడూ పెళ్ళి చేసుకుంటుంది. ఎన్నివేల సంవత్సరాలనుంచి చేసుకుంటున్నా మళ్ళీ చేసు కుంటుంది...లోకం మహారాజు లాంటిది!

"ఏనాటి ముసలి ఈ కడలి" అంటూ కడలిరాజు నుద్దేశించి, ఎన్నిపాటలురాస్తేనేం? ఎన్ని ఉపన్యాసాలిస్తే మాత్రమేం? లోకం పెళ్ళి జరిగి తీరుతుంది.

దీపావళి పండుగనాడు పెళ్ళిచేసుకుంటుంది. శ్మశానం లాంటి అవకాశం. పెళ్ళి చేసుకుంటున్న లోకానికి ఆదర్శం.

కామాక్షి అద్దంలో మొహం చూసుకుంటుంది. అప్పు డప్పుడు నిలువుటద్దం ముందు నగ్నం నించుంటుంది. తనలో తనే మురిసిపోతుంది..సిగ్గుపడుతుంది. ఆదర్శంవంటి ఆకాశంలో లోకం తన నగ్నసౌందర్యం చూసుకుంటుంది.

అందుచేతనే పెళ్ళిచేసుకుంటున్న లోకం మందుగుండు వెలిగిస్తోంది...మతాబాల తలంబ్రాలు లోకం నెత్తిమీద జల జలా రాలుతున్నాయి:—దేవతలు కురిపించిన పూలవానలాగ, అమెరికా కురిపించిన ఆటంబాంబుల్లాగ!

విలోకీ సుదీర్ఘంగా ఆలోచిస్తున్నాడు.

ఆలోచించడానికి వీల్లేదని శాశించింది, పెళ్ళిచేసు కుంటున్న లోకం. ఆలోచన మానిఫెస్టోల్ని కంటుందని లోకం భయం; అంచాతనే ఆలోచన పనికిరాదంది, తెలివిగా. ఆలో చిస్తే అజ్ఞానులంతాకలసి, కారల్‌మార్క్సులా గెడ్డాలు పెంచ డం ప్రారంభిస్తారని కనిపెట్టింది జ్ఞానం గల లోకం.

"ప్రయత్నించు—ప్రయత్నించు
ప్రయత్నించు మానవుడా!
ప్రయత్నాలు ఫలితాలకు తల్లులు!!"

అని. అంచాతనే విలోకి ప్రయత్న పూర్వకంగా ఆలోచిస్తున్నాడు.

శ్మశానంలాంటి ఆకాశంచూస్తూ లోకం శాసించింది. అయినా విలోకి ఆలోచన మానలేదు. యోచిస్తున్నకొద్దీ విలోకిస్తున్నవన్నీ ప్రశ్నార్థకాలే!

దీపాలు వెలిగించ...మతాబాల తలంబ్రాలు పోసుకుని ...తారాజువ్వల పందిట్లో...చిచ్చుబుడ్ల సంపెంగ త్రాచుల తోటలో...లోకం పెళ్ళిచేసుకుంటోంది, విలోకి నివ్వెరపోయి చూస్తాడు.

పెళ్ళిచేసుకుంటున్న లోకం కోటకి అశాంతిదూతక చట్టాలవారు పహరావేస్తున్నారు.

లోకం కోటగోడ ప్రక్కనే కూర్చుని గంజాయి త్రాగుతున్నాడు వేదాంతి. "కల్లనిజమవుతుంది—నిజము కల్లవుతుంది; పగలు రాత్రవుతుంది..రాత్రి పగలవుతుంది బ్రహ్మామూ!" అంటూ పాట పాడుతున్నాడు వేదాంతి. తంబుర మీటుతున్నాడు..."లోకంమాయ" అంటాడు వేదాంతి.

విలోకి కన్నుల యెట్టయెదుట ఒక దుస్సంఘటన జరుగుతుంది. ఒక మహాకవికి కోపంవచ్చి ఒక కావ్యాన్ని గిరాటు

వేస్తాడు..."మహారాజు మనీపర్సు—జమీందారు రోల్సు కారు—మాయింటావూ!... కూలివాని నుదిటి చెమట మాయంటావా?—ఏయ్ ఏమంటావు? నా ముద్దుల వేదాంతీ!" అని నిలదీసి ప్రశ్నిస్తాడు ప్రజల తరపున కవి...కావ్యం బాణంలా పరిగెడుతుంది. వేదాంతిని వెంటాడుతుంది.

లోకమేమీ వినాయకుడు కాదు-వీణవాయించుకుంటూ కూర్చోడానికి! లోకం దేవుడిలాంటిది. ఎన్ని అడ్డంకులు వచ్చినా తప్పని సరిగా పెళ్ళిచేసుకు తీరుతుంది. ముత్యాల ముత్యాల తలంబ్రాలు బియ్యంలా మూటగట్టుకొని లోకం—పౌరోహిత్యుడు చల్లగా, మౌంట్ బాటెన్ తమ్ముడిలాగ జారుకుంటాడు.

"నిన్నకీ, రేపుకీ గల విభేదాన్ని లోకం గుర్తించడం లేదు. అంచాతనే లోకంమారి తీరుతుంది!" అంటాడు విలోకి.

కమ్యూనిస్టు మానిఫెస్టో, పేదవాళ్ళ మాగ్నాకార్టా ప్రకటించినా, సోషలిజం తుఫానులా గర్జించినా,—ప్రజలతరపున, ప్రజలకోసం, కామన్ వెల్తు మహాసభ జరిగిపోయినట్టే, లోకం పెళ్ళి జరిగిపోతుంది.

నూరేళ్ళూ నిండిపోతేనేం గాక?—శుభమా అని లోకం పెళ్ళిచేసుకుంటుంటే, ఒకటో అరో పిచ్చివాళ్ళు వ్యతిరేకంగా అరుస్తారు?—అరిస్తే, ఎవరికిలెక్క! లోకం పెళ్ళి బ్రహ్మాండ భాండంగా జరుగుతుంది.

శ్మశానంలాంటి ఆకాశం... పేదల జీవితాన్ని కాల్చుకుని, సంతోషాన్ని తినే పెళ్ళికూతురు లోకాన్ని ఆశీర్వదిస్తుంది లోకం భవిష్యత్తుని తనలో ప్రతిఫలించి తీరుతుంది. తప్పుతుందా? దానివిధి నిర్వర్తిస్తుంది!

---

[ప్రచురణ : 'మాలి' మాసపత్రిక, 1949–ఆగస్టు]

[ఎడిటర్ : ఎస్. ఆర్. చందూర్]

